నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
గురువారం | ఫిబ్రవరి 13, 2025 | www.navatelangana.com

పాఠశాలను సందర్శించిన ట్రైనీ కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలను ఆదిలాబాద్ ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులను పరిశీలించారు. సాయంత్రం అల్పాహారంగా శనగలు అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకునేలా విద్యార్థులకు తగు సూచనలు చేశారు. అభ్యాస దీపికలు, ఐఎఫ్‌పీ ప్యానల్ ఉపయోగించి వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.



గిరిజన గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-బోథ్

మండలంలోని నక్కర్‌వాడ గ్రామ పంచాయతీలో గల మారుమూల గిరిజన గ్రామాలైన కొత్తపల్లి, రేండ్లపల్లిలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం పర్యటించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజులలో ఎలాంటి సమస్యలున్నా తనని సంప్రదించవచ్చని తెలిపారు. ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



కొనుగోళ్లపై కొర్రీలు..!

- ఎకరానికి 3.30క్వింటాళ్ల కందుల కొనుగోలుకు అనుమతి
- వాస్తవంగా ఒక్కో ఎకరానికి 6 నుంచి 8క్వింటాళ్ల దిగుబడి
- ఆంక్షల కారణంగా మిగిలిన పంట అమ్మకంపై ఆందోళన
- పరిమితి పెంచాలని రైతు సంఘాలు, అన్నదాతల డిమాండ్

కందుల కొనుగోళ్లపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఎకరానికి కేవలం 3.30క్వింటాల్‌లు మాత్రమే కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. ఈ నిబంధనపై అన్నదాతల్లో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. మిగితా పంటను ఎక్కడ విక్రయించాలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది వరకు సోయాకు కూడా తొలుత ఇలాంటి నిబంధనలు విధించిన ప్రభుత్వం స్థానిక రైతుల విజ్ఞప్తి మేరకు 10క్వింటాల్‌ల వరకు పరిమితి పెంచింది. తాజాగా కందుల విషయంలోనూ ఎకరానికి కేవలం 3.30క్వింటాల్‌ల వరకే కొనుగోలు చేస్తామని స్పష్టం చేయడం..ఈ నిర్ణయంపై రైతులు, రైతు సంఘాల ప్రతినిధుల నుంచి తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. రైతుల విజ్ఞప్తి మేరకు జిల్లా ఉన్నతాధికారులు సైతం స్పందించి పరిమితి పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాధించినట్లు తెలిసింది. కానీ సర్కారు నుంచి ఇప్పటి వరకు నిర్ణయం రాకపోవడంతో అధికారులు సైతం స్పష్టమైన సమాధానం చెప్పలేని పరిస్థితి కనిపిస్తోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి, సోయా తర్వాత కందిని ప్రధాన పంటగా పండిస్తారు. అనేక ప్రకృతి విపత్తులు, ఒడిదొడుకులను తట్టుకొని పండించిన ఈ పంటకు తీరా మార్కెట్‌కు వచ్చే సరికి ప్రభుత్వం వివిధ రకాల కొర్రీలు పెట్టడంతో అన్నదాతలు హైరాన పడుతున్నారు. పండించిన పంటలను ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేందుకు అయిష్టత చూపిస్తుండటంతో కారణంగానే వివిధ రకాల నిబంధనలు విధిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 89,959 ఎకరాల్లో కంది పంట వేశారు. ఎకరానికి ఆరు క్వింటాళ్ల చొప్పున పరిగణనలోకి తీసుకుంటే సుమారు 5.39లక్షల క్వింటాల్‌ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా తక్కువ పరిమితిలో కొనుగోలు చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎకరానికి కేవలం 3.30క్వింటాల్‌లు మాత్రమే కొనుగోలు చేయాలని నిర్ణయించడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మిగితా పండించిన పంటను ఎక్కడ విక్రయించాలా..?అని మదనపడుతున్నారు. ప్రభుత్వం పరిమితిని పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

పరిమితిపై ఆందోళన..!

ప్రభుత్వం కందుల కొనుగోళ్లపై పరిమితి విధించడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం క్వింటాల్‌కు రూ.7550వరకు ఉంది. ఒక్కో రైతుకు ఎకరానికి 6 నుంచి 8క్వింటాల్‌ల వరకు కంది పంట పండింది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా ఉమ్మడి జిల్లాలో 19 కేంద్రాలు ఏర్పాటుచేసి కొనుగోళ్లను చేపడుతోంది. కానీ అనేక మంది రైతులు మార్కెట్‌కు అధికశాతం కంది పంటను తీసుకొస్తుండగా..అధికారులు ఆంక్షలు విధిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. కేవలం 3.30క్వింటాల్‌ల పరిమితి సరికాదని.. పెంచాలని కోరుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర లభించకపోతే ప్రయివేటులో తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేటులో క్వింటాల్‌కు కేవలం రూ.7100 వరకు మాత్రమే ధర చెల్లిస్తుండటంతో మిగితా పంటను అక్కడ విక్రయిస్తే క్వింటాల్‌కు రూ.450 వరకు నష్టపోయే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయమై ఇది వరకే రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా..పరిమితి పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాధనలు పంపించినట్లు తెలిసింది.

ప్రభుత్వం పరిమితి పెంచాలి : ఎల్టీ కాంత్‌రెడ్డి, రైతు, సాంగ్వి



ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో కంది పంట వేయగా 25క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో ఎకరానికి కేవలం 3.30క్వింటాల్‌లు మాత్రమే కొనుగోలు చేస్తామని చెబుతోంది. దీంతో తాము తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం పునరాలోచించి ఎకరానికి 6 నుంచి 7క్వింటాల్‌ల వరకు కొనుగోలు చేయాలి.

రైతులు తీవ్రంగా నష్టపోతారు : బండి దత్తాత్రి, అఖిలపక్ష రైతు సంఘం నాయకుడు



ప్రభుత్వం కందుల కొనుగోలుపై ఆంక్షలు విధించడం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఎకరానికి కేవలం 3.30క్వింటాల్‌ల వరకే పరిమితం చేయడం సరికాదు. ఒక్కో ఎకరానికి కనీసం 6నుంచి 8క్వింటాల్ వరకు దిగుబడి వస్తుంది. మిగితా పంటను ప్రయివేటులో విక్రయిస్తే నష్టపోతారు. ప్రభుత్వం కందుల కొనుగోలుకు పరిమితిని పెంచాలి.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినం : ప్రవీణ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం

జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా కందుల కొనుగోలు ప్రారంభించాం. పరిమితి పెంచాలని రైతుల విజ్ఞప్తి మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రభుత్వానికి ప్రతిపాధనలు పంపించాం. అక్కడ్నుంచి ఆదేశాలు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటాం.

కందుల కొనుగోళ్ల పరిమితి పెంచాలని మంత్రికి వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో ప్రస్తుతం ఉన్న కందుల కొనుగోళ్ల పరిమితిని పెంచాలనే వినతి మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 3.35 క్వింటాళ్ల పరిమితిని 8క్వింటాళ్లకు పెంచుతూ రెండు మూడు రోజుల్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తుందని పేర్కొన్నారు. రైతులు తమ పంట ఉత్పత్తులను విక్రయించుకోవడానికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. జొన్నల విషయంలోనూ మంత్రితో చర్చించామని ఎకరానికి 20క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉన్నందున పరిమితిని పెంపు చేస్తూ ముందే ఉత్తర్వులు ఇవ్వాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. రైతులు తక్కువ ధరతో దూర ప్రాంతాలకు వెళ్లి పంటలను అమ్ముకోవాల్సిన అవసరం లేదని, స్థానిక మార్కెట్లోనే మద్దతు ధరతో విక్రయించుకోవాలని అన్నారు.

వేసవిలో నిరంతర విద్యుత్ కోసం ఏర్పాట్లు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న వేసవికాలంలో విద్యుత్ వినియోగదారుల అవసరాల నేపథ్యంలో నిరంతర విద్యుత్ అందించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈ జీవరత్నం తెలిపారు. మండలంలోని దస్నాపూర్ ప్రాంతాల్లో 100 కేవీ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏఈ లక్ష్మీరాజంతో కలిసి చార్జి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో వేసవిలో ఇబ్బందులు వచ్చే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు, విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. దస్నాపూర్‌లో బిగించిన ట్రాన్స్‌ఫార్మర్‌తో లో వోల్టేజ్ సమస్య తీరి కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ శంకరయ్య, కాంట్రాక్టర్ ప్రహ్లాద్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పట్ల ఏకపక్షంగా వ్యవహరించిన సీఎం




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ వర్గీకరణలో సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించి అసెంబ్లీలో బిల్లు పెట్టారని మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పుల రమేష్ ఆరోపించారు. కమిషన్‌ను ఏర్పాటు చేయాలంటే నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ అనుమతి తప్పని సరి ఉండాలని, కానీ అవేవి పట్టించుకోలేదని మండిపడ్డారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై అసెంబ్లీలో 1, 2, 3 కేటాగిరీలుగా చేస్తూ తీర్మానించారని, ఆమోదం కోసం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా దళితులను చీల్చడానికి ఒక వర్గానికి మద్దతుగా వ్యవహరించడం సరికాదన్నారు. చట్టబద్ధత కలిగిన వర్గీకరణకు తాముకూడా సిద్ధమన్నారు. ఆర్టికల్ 341 ప్రకారం చేస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కాంగ్రెస్ మాలలపై నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని, వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు మల్లన్న, రాజేశ్వర్, ప్రహ్లాద్, కిరణ్, సుధీర్, రాఘువేంద్ర పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

నవతెలంగాణ-జైపూర్



పెగడపల్లి శివాలయం, రసూల్‌పల్లి ఆంజనేయస్వామి ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను బుధవారం ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 1, 7న పెగడపల్లి, రసూల్‌పల్లి ఆలయాల్లోకి చొరబడి ఎన్టీపీసీ లక్ష్మీపురం గేట్ ఏరియాకు చెందిన తాటికొండ అనిల్(28), గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన బెజ్జాల విష్ణు(28) దోపిడీకి పాల్పడ్డారు. వీరి వద్ద నుండి రూ.3000 నగదును స్వాధీనం చేసుకుని చెన్నూరు కోర్టులో హాజరు పరిచారు. నిందితులను పట్టుకోవడంలో శ్రీరాంపూర్ సిఐ వేణుచందర్ పర్యవేక్షణలో జైపూర్, శ్రీరాంపూర్ ఎస్సైలు శ్రీధర్, సంతోష్, ఎఎస్ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ సదానందం చాకచక్యంగా వ్యవహరించారు. వీరిని ఏసీపీ వెంకటేశ్వర్లు అభినందించారు.

విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి

- ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి
- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో అధికారులతో సమీక్షా సమావేశాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్


పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో హెచ్‌ఎం, సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యదర్శి నిర్వహించిన రివ్యూ మీటింగ్ అంశాలను తెలియజేస్తు ఎఫ్ఎల్ఎన్, స్లిప్ టెస్టులు, ఎండీఎంను పకడ్బందీగా అమలు చేయాలని, పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించే ప్రత్యేక తరగతులను ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా అధికారులు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులకు స్లిప్ టెస్టుల ఫలితాలను సమీక్షిస్తు వారి సామర్థ్యాలను గుర్తిస్తు వెనకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. వెనకబడిన విద్యార్థులు కూడా రాణించేలా సబ్జెక్టుల వారీగా గ్రూపులను తయారు చేసి ప్రత్యేక బోధనలు చేయాలని సూచించారు. త్వరగా నేర్చుకునేలా ఏ విధంగా బోధించాలో ఉపాధ్యాయులు తెలుసుకోవాలన్నారు. ఈ సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను మెరుగైన స్థానంలో నిలిపేలా ప్రతి ఒక్క హెచ్‌ఎం, ఏసీ, ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం భోజనంలో నాణ్యత పాటించేలా చూడాలని, ఉపాధ్యాయులు రోజు వాటి రుచులు చూడాలని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, ఏడీ వేణుగౌడ్, ఏసీజీ వేణుగోపాల్‌రెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్లు సుజాత్ ఖాన్, ఉస్మాన్, శ్రీకాంత్‌గౌడ్, నారాయణ, కేజీబీవీ ఎస్ఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో మాట్లాడుతున్న ఆర్జేడీ

నిర్మల్‌టౌన్ : కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో విద్యాధికారుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతికి జిల్లాలోని ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. అపార్ నమోదు, ఎండిఎం నిర్వహణ రిపోర్టులు పాఠశాలల వారీగా నిర్వహించాలని సూచించారు. బాధ్యులు ప్రతి పాఠశాల సందర్శించి వివరాలన్నీ నమోదు అయ్యేటట్లు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, కోఆర్డినేటర్లు రాజేశ్వర్, నర్సయ్య, ప్రవీణ్, లింబాద్రి, ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్మల్ సమావేశంలో పాల్గొన్న విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు



రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

- సింగరేణి సీఅండ్ఎండీ ఎన్.బలరాం
- కాసిపేట-1, 2 ఇంక్లైన్ గనుల పరిశీలన



నవతెలంగాణ - కాసిపేట

రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని సింగరేణి చైర్మన్, ఎండీ ఎన్.బలరాం స్పష్టం చేశారు. బుధవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట-1 ఇంక్లైన్, 2 ఇంక్లైన్ గనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎండీ బలరాంకు ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గనులపై సమావేశాలు నిర్వహించారు. ముందుగా ఉద్యోగులతో మాట్లాడి పలు అంశాలపై చర్చించారు. అనంతరం సీఅండ్ఎండీ బలరాం మాట్లాడుతూ టీం వర్క్‌గా పని చేస్తేనే ఉద్యోగానికి న్యాయం చేయగలమన్నారు. రక్షణ, ఉత్పత్తి రెండు కళ్లలాంటివని, సంక్షేమానికి సంబంధించి ఉద్యోగులకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. త్వరలో మరిన్ని కొత్త ప్రాజెక్టులు వస్తున్నాయన్నారు. శక్తిని రక్షణ, ఉత్పత్తిలో పెట్టాలని సూచించారు. సంక్షేమ పరంగా ఉద్యోగులకు లోటు పాట్లు లేకుండా ఇంత చేస్తున్నా ఉత్పత్తిలో చూస్తే కొన్ని గనుల్లో 60,70 శాతంకు మించడం లేదన్నారు. గతంలో భూగర్భ గనుల నుంచి 30వేల టన్నుల వరకు రోజు వచ్చేదని, ఈ రోజుల్లో 13,14 వేలు రావడం లేదన్నారు. పెరగాల్సింది పోయి తగ్గుతోందన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఓపీ డైరెక్టర్ సూర్యనారాయణ, పీపీ డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు, జీఎం దేవేందర్, ఏజెంట్ రాందాస్, ఏఎస్వో రవీందర్, కాసిపేట-1వ గని మేనేజర్ భూ శంకరయ్య, కాసిపేట-2 గని మేనేజర్ గొడిశెల లక్ష్మీనారాయణ, ఎస్ఓ నిఖిల్, వెల్ఫేర్ సెక్షన్ క్లర్క్ బన్న లక్ష్మణ్‌దాస్, పలువురు యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పత్తి వ్యాపారి ఇంట్లో చోరీ



నవతెలంగాణ-బోథ్

సొనాల మండల కేంద్రంలోని బృందావన్ కాలనీకి చెందిన పత్తి వ్యాపారి షేక్ ఉస్మాన్ ఇంట్లో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. కుటుంబీకులందరూ బంధువుల పెండ్లికి మహారాష్ట్రలోని నాందేడ్‌కు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండగా దొంగలు ఇంట్లో చొరబడి బీరువాను పగులగొట్టారు. అందులోని ఆరు తులాల బంగారం, 18 తులాల వెండి, లక్ష రూపాయల నగదు దొంగలించారని బాధితుడు తెలిపాడు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలో ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలకు పెద్ద పీట వేశామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం వాన్‌వాట్ గ్రామంలో హీరాసుక జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తున్నాయన్నారు. ఆచారాలను కాపాడేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆదివాసీ పండగలపై చిత్తశుద్ధి లేదన్నారు. ఆదివాసులకు పోడు పట్టాలు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఆదివాసుల ఆరాధ్య దైవం కుమురం భీం ఆశయాల సాధనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదివాసీ గిరిజనులకు అండగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నైతం లక్ష్మి శుక్లాల్, కిషన్, దమ్మపాల్, మోతీరామ్, ప్రశాంత్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | ఫిబ్రవరి 13, 2025 | www.navatelangana.com

రంజీ ట్రోఫీ క్రీడాకారుడికి సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రానికి చెందిన కొడిమల హిమతేజ రంజీ ట్రోఫి క్రికెట్ పోటీలో హైదరాబాద్ తరపున ఆడాడు. తిరిగి జిల్లా కేంద్రానికి వచ్చిన నేపథ్యంలో బుధవారం పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త



ముడుపు మౌనిష్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్లారు. ముందుగా హిమతేజను ఆయన తండ్రిని శాలువతో సత్కరించి కాసేపు ముచ్చటించారు. హిమతేజ రంజీలో ఆడటం జిల్లాకి గర్వకారణమని కొనియాడారు. హిమతేజ దేశానికి ప్రాతినిధ్యం వహించాలని మౌనిష్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోరెడ్డి శ్రీనివాస్, దినేష్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ సీనియర్ నాయకులు నాంపల్లి వేణుగోపాల్ మాతృమూర్తి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయల శంకర్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట ఉష్కం రఘుపతి, ఆకుల ప్రవీణ్, రాకేష్ ఉన్నారు.



విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ప్లాటినం జూబ్లీ వేడుకలు



నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో బుధవారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూనియన్ ఏర్పాటు చేసి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్మల్ సర్కిల్, ఖానాపూర్ సబ్ డివిజన్ ముందు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి అక్కల పోచయ్య, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు కొడాలి వెంకటరమణ, మనోహర్‌స్వామి, కార్యనిర్వహణ అధ్యక్షులు తిరుపతి, రాష్ట్ర కార్యవర్గం కోరిపల్లి శ్రీనివాస్, దాసరపు రాజేశ్వరరావు, ఖానాపూర్ సబ్ డివిజన్ నాయకులు అప్పారావు ఎస్ఎల్ఐ అంకం నరేష్, కొంక శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్బీఐ బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-నార్నూర్

బీమాతోనే కుటుంబానికి ధీమా ఉంటుందని ఆదిలాబాద్ ఆర్బీఓ కె.సురేష్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన రాథోడ్ ప్రకాష్ కొన్ని నెలల కింద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా ఎస్బీఐ బ్యాంక్‌లో రూ.వేయి వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ చేయడంతో రూ.20లక్షల చెక్కును బుధవారం నామినికి అందజేశామన్నారు. అప్పులు కట్టేసి మిగిలిన డబ్బులు తన కూతురి భవిష్యత్తు కోసం ఫిక్స్ డిపాజిట్ చేసుకున్నారని బ్రాంచ్ మేనేజర్ మాలోత్ రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, తగరం రవి, వెంకట కృష్ణ, బాలకృష్ణ, సాయి, రాజు, సచిన్ జాదవ్, రాహుల్, మాజీ సర్పంచ్ గజానంద్, బీజేపీ మండలాధ్యక్షుడు రాథోడ్ బిక్కు ఉన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకోవాలి



నవతెలంగాణ-బోథ్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకోవాలని లెక్చరర్ రవి అన్నారు. అధ్యాపకుల అడ్మిషన్ డ్రైవ్ 2025-2026 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్‌లకు కొరకు ప్రతి పాఠశాలను సందర్శించడం జరుగుతుందన్నారు. బుధవారం మండలంలోని మర్లపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి చదువుతున్న విద్యార్థులను అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా విద్యార్థులకు తగు సూచనలు చేసి విద్యార్థులందరినీ ప్రభుత్వ కళాశాలలోనే అడ్మిషన్ పొందాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, మర్లపల్లి పాఠశాల ఉపాధ్యాయులు ఉదయ్‌రెడ్డి, అనిల్, లెక్చరర్‌లు చింతల రవి, లక్ష్మిపతి పాల్గొన్నారు.

తెలుగు వికీపీడియా సదస్సుకు ఆహ్వానం

నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 14 నుంచి 16 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో జరిగే తెలుగు వికీపీడియా 21వ వార్షికోత్సవానికి జిల్లాకు చెందిన ఆదివాసీ వికీపీడియన్స్ ఆత్రం రాజ్ కుమార్, సిడాం వరప్రసాద్, సిడాం కిరణ్ కుమార్, ఆత్రం మోతీరామ్ ఆహ్వానాలు అందుకున్నారని బోలి చేతో ఫౌండేషన్ బోర్డు సభ్యులు ఆత్రం మోతీరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు వికీపీడియాలో ఆదిలాబాద్ జిల్లా విశేషాలు పొందుపరిచి, తెలుగు వికీపీడియా స్వేచ్ఛ విజ్ఞాన సర్వస్వం అభివృద్ధికి కృషి చేసినందుకు ఆహ్వానాలు అందుకున్నామని తెలిపారు.

అఖండ హరినామ సప్తహా పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని హస్నాపూర్ గ్రామంలో నిర్వహించే సప్తహా వేడుకలకు సంబంధించిన పోస్టర్‌లను బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ విడుదల చేశారు. ఈ సప్తహా ఈనెల18 నుంచి 25 వరకు కొనసాగుతుందని, ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి 12 గంటల వరకు భజనలు, కీర్తనలు అన్నదానం మహా ప్రసాదం ఉంటుందన్నారు. 25న మంగళవారం కాలా కార్యక్రమం ఉదయం నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హజరవుతున్నట్టు తెలిపారు. ఈ అఖండ హరినామ సప్తహాలో భక్తులు పాల్గొని, విజయవంతం చేయాలని హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-ఉట్నూర్

మండలానికి చెందిన బీజేపీ నాయకులు లింగన్నతో పాటు పలువురు నాయకులు బుధవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజాపాలనకు ఆకర్షితులై వారు పార్టీలో చేరినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం వారికి పార్టీ కండువాలు కప్పి సాధారణంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సంస్కృతి సాంప్రదాయాలను మరువొద్దు

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

తరతరాలుగా ఆచరిస్తూ వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రధాన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గోండి ధర్మ గురు హీరాసుక జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ముందుగా సాంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలను కాపాడటంలో హీరాసుక పాత్ర కీలకమైందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ సంస్కృతి సాంప్రదాయాలను అనుసరించి భావితరాలకు అందజేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ముందు వరుసలో ఉంటుందని, ఎ సమస్యలున్న దశల వారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ఆదివాసీ ప్రధాన్ సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, హీరాసుక జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పటేల్, దేవారి, మహిళలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడ్డ కేసీఆర్

- మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అన్ని వర్గాల సంక్షేమానికి గత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాటుపడ్డారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం పట్టణంలోని జామా మసీదుతో పాటు చామన్‌వాలా బాబా కమిటీ హాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయిన నేపథ్యంలో వాటిని సందర్శించారు. గత ప్రభుత్వ హయాంలో మసీదు అభివృద్ధి నిమిత్తం రూ.2కోట్ల నిధులు విడుదలయ్యాయి. 200 ఏండ్లనాటి అతి పురాతనమైన మసీదుగా గుర్తింపు పొందిన జామా మసీదులో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దారు. నిర్మాణ పనులను పర్యవేక్షించిన మాజీ మంత్రి పనుల తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పట్టణంలోని పలు మసీదులు, దర్గాల అభివృద్ధి నిమిత్తం రూ.17 కోట్ల నిధులు మంజూరయ్యాయని, అందులో రూ.12కోట్ల నిధులు విడుదలైనట్టు తెలిపారు. మిగిలిన నిధుల విడుదల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు ఉన్నతాధికారులను సైతం కలుస్తామని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడ్డారని అన్నారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు ఇస్రాత్ హుస్సేన్, బాబు బాయ్, సయ్యద్ అలీ, సాజిదోద్దీన్, అజయ్, అశ్రఫ్, హైమద్, అత్తారుల్లా, జాహుర్, ఫెరోజ్, ఐషాన్, అయూబ్, అంజాత్ పాల్గొన్నారు.

ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-సిరికొండ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్పీఓ ఫణీందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రానికి సమీపంలోని రైతు వేదికలో ప్రజావాణి ప్రజాఫిర్యాదుల పరిష్కార కేంద్రం, బహిరంగ విచారణ వేదిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో నిర్వహించిన ప్రజావాణిలో 123 ధరఖాస్తులు రాగా, వాటిలో నుంచి 73 పరిష్కారం అయ్యాయని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యల గురించి లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకెళ్తే అప్పుడే పరిష్కారం అయ్యే విధంగా ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రం ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తుకారాం, ఎంపీడీఓ రవీందర్, మండల వ్యవసాయాధికారి శ్రద్ధ రాణి, ఎంపీఓ సంతోష్, ఇన్‌చార్జ్ విద్యుత్ శాఖ ఏఈ రోహిదాస్, డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్, ఉపేందర్, మండల సర్వేయర్ గణేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-కడెం

మండలంలోని దిల్దార్‌నగర్ గ్రామ సమీపంలోని అక్కొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాభివృద్ధి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం అక్కొండ లక్ష్మీ నరసింహా జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఏ సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు ప్రొద్దుటూరు సతీష్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బరుపటి రమేష్, మాజీ ఎంపీటీసీ మాజీ సర్పంచులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు తాళ్లపెల్లి రమేష్, కోల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విగ్రహా ప్రతిష్టాపనకు ఆహ్వాన పత్రిక అందజేత

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ప్రభుస్వామి దేవాలయంలో లక్ష్మీనరసింహ స్వామి, హనుమాన్ సహిత, నవగ్రహ, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్టాపన మహోత్సవానికి హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావును కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఇందులో నిర్మల్ దేవరకోట ఆలయ చైర్మెన్ కొండ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

నేరడిగొండ : శబరిమాత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి హజరు కావాలని బజార్‌హత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామస్తులు బుధవారం కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ అడే గజేందర్ క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల మార్చి 4 నుంచి 6వరకు జరిగే విగ్రహా ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఆహ్వానించువారిలో గిర్నూర్ వీడీసీ సభ్యులు, గ్రామస్తులు, శబరి మాత భక్తులు పాల్గొన్నారు.



జీవితంలో ఎదగాలంటే నైపుణ్యాలుండాలి

- సాఫ్ట్ స్కిల్స్‌పై విద్యార్థులకు శిక్షణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలంటే నైపుణ్యాలను కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ప్రిన్సిపల్ డాక్టర్. జె. సంగీత తెలిపారు. తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో టాస్క్ సౌజన్యంతో కమ్యూనికేషన్ నైపుణ్యాలపై బుధవారం ఒకరోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో స్థిరపడాలంటే కమ్యూనికేషన్ నైపుణ్యాలు కలిగి ఉండాలని అన్నారు. ఎంతో విలువైన శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఐ. శ్రావణి, టీఎస్‌కేసీ మెంటార్ ఎండీ. ఇమ్రాన్ అలీ, టాస్క్ శిక్షకుడు మార్క్ లూయిస్ హర్ని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినిని కిడ్నాప్ చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని స్వర్ణ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడి చేసిన కేసులో యువకుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ, బుధవారం బీజేపీ పార్టీ నాయకులు మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఎస్సై సాయి కుమార్, రూరల్ సీఐ కృష్ణకు సమాచారం అందించగా ధర్నా వద్దకు చేరుకొని తప్పుచేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ చేశామని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ తెలుపడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు నరేష్, జిల్లా బీజేవైఎం అధ్యక్షులు అర్జున్, నిర్మల్ పట్టణాధ్యక్షులు సాయి, బీజేపీ నాయకులు కరుణా సాగర్‌రెడ్డి, పోతన్న, లక్ష్మణ్, భీమ లింగం, జగదీష్, మల్లేష్, శ్రీనివాస్, నర్సయ్య, ప్రకాష్, భూమేష్, దయాకర్ రెడ్డి పాల్గొన్నారు.

హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ శిక్షణ తరగతులు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ డిపోలో ఆధ్వర్యంలో హెవీ మోటర్ వెహికిల్ డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్టు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. లైట్ మోటార్ డ్రైవింగ్ లైసెన్సు, బ్యాచ్ నెంబర్ కలిగిన అభ్యర్థుల కొరకు నిర్మల్ ఆర్టీసీ డిపోలో హెవీ మోటర్ డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ శిక్షణ 30 రోజులు ఉంటుందని, నిపుణులైన అనుభవజ్ఞులైన డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లచే ఆర్టీసీ ప్రాక్టికల్ బస్సు నడుపుట, థిరీ క్లాసులు ఉంటాయని తెలిపారు. శిక్షణ అనంతరం టెస్ట్ పెట్టి సర్టిఫికెట్ అందజేయడంతో పాటు ఈ సర్టిఫికెట్ ఆర్టీఓ దగ్గర లైసెన్స్ పొందేటప్పుడు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ పొందడానికి ఆర్టీసీకి రూ.15వేల 600 ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు రూ.10వేలు చెల్లించాల్సి ఉంటుందని మరిన్ని వివరాలకు ఎన్.రాజన్న సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ 7382842443 ను సంప్రదించాలని డిపోమేనేజర్ తెలిపారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారం నరేందర్‌రెడ్డితోనే సాధ్యం

నవతెలంగాణ-బేల

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బలపరుస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డితోనే పట్టభద్రుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రయివేటు పాఠశాలలకు వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఉట్కూరి నరేందర్‌రెడ్డిని గెలిపించేందుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట కన్న రాజు, సునీల్ ఉన్నారు.

ముజ్గి మల్లన్న జాతరలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మండలంలోని ముజ్గి గ్రామంలో మల్లన్నస్వామి జాతర వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా స్వామివారిని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సత్కరించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మెన్ సోమ భీమ్‌రెడ్డి, రత్నాపూర్ కాండ్లి మాజీ సర్పంచ్ కొండ్రు రాంరెడ్డి, రవి, యువజన కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి, అరుణ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | ఫిబ్రవరి 13, 2025 | www.navatelangana.com

పటిక బెల్లం పట్టివేత

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలోని లంబాడిహెట్టి గ్రామంలో నాటు సారాం తయారీకి పటిక బెల్లం అక్రమంగా రవాణ చేస్తున్నారన్న సమాచారం మేరకు పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వి.రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లంబాడిహెట్టి వద్ద సమాచారం మేరకు ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేశారు. 80 కిలోల బెల్లం, 120 కిలోల పట్టిక, 10 లీటర్ల నాటుసారా, టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన సవిత, గుడ్లబోరికి చెందీన శంకర్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని బంబారా గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 25 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఇద్దరు విద్యార్థుల రక్తనమూనాలు సేకరించి మండలం ప్రభుత్వ ఆస్పత్రి ల్యాబ్‌కు పంపించారు. అనంతరం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు డెంగ్యూ, కుష్టు, క్షయ, మలేరియా వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎప్పటికప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవాలనీ సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సునంద, ఆశావర్కర్ సరోజ, పాఠశాల సిబ్బంది కొట్నాక కైలాష్, మేస్త్రం దాదాజీ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వసతులు కల్పించకుంటే ఉద్యమిస్తాం

- మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా ఆస్పత్రిలో పేద రోగులకు కనీస మౌలిక వసతులు కల్పించకుంటే భవిష్యత్తులో ఉద్యమానికి సిద్ధమవుతామని బీజేపీ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ఎన్నో ఆశలతో పేద రోగులు జిల్లా ఆస్పత్రికి వస్తున్నారన్నారు. ఆస్పత్రిలో ఉన్న యంత్రాలను కూడా ఉపయోగించడానికి డాక్టర్లు లేరంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. డయాలసిస్ రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఏమీ చేయలేని పరిస్థితుల్లో అక్కడే ఉండాల్సిన దుస్థితి ఉందన్నారు. ఆస్పత్రిలో వైద్యులు, మందులు ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతిదీ కొరత ఉందని ఆరోపించారు. మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్లు లేకపోవడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వైద్య విద్యార్థుల ధర్నా సందర్భంగా వారు చెప్పిన పలు అంశాలు మనసును కలిచివేశాయన్నారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు జిల్లా ఆస్పత్రికి వచ్చే వైద్యులకు డీఎంఎఫ్టీ నిధుల ద్వారా అదనపు మొత్తాన్ని చెల్లించి తీసుకువచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కలెక్టర్ స్పందించి ఆస్పత్రిలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆ దిశగా చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో పెద్ద మొత్తంలో ఆందోళన చేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుంకరి పెంటయ్య, నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

బ్యాంకులలో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఎస్‌బీఐ ఇన్‌ఛార్జి మేనేజర్ రాఖీరాణి ఘోష్‌కు వినతిపత్రం అందించారు. తమకు బ్యాంకులలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆర్‌బీఐ ఆదేశాలున్నా అమలు చేయడం లేదని, ఇప్పటికైనా దీనిని అమలు చేయాలని కోరారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ డైరీతో పాటు 'పిలుపు' మాసపత్రికను అందించారు. కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సభ్యులు కలికోట రమణయ్య, ఎ. నాగేశ్వర్‌రావు, సుదర్శన్, కె. రామారావు, శ్యాంరావు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యుత్ శాఖలోని టీఈఈ 1104 సంఘం ప్లాటినం జూబ్లీ 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పండ్ల పంపిణీకి ముఖ్య అతిథులుగా జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ శేషారావు హాజరై రోగులతో మాట్లాడి వారి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. విద్యుత్ శాఖలో జరుగుతున్న అభివృద్ధి పనులలో సంఘం పాత్ర ఎంతో ఉందన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు విలాస్ కుమార్, కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో పండ్లు పంపిణీ చేశామన్నారు. డివిజన్ ఇంజనీర్ జీవరత్నం, అకౌంట్స్ ఆఫీసర్ తుకారాం మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, యూనియన్ నాయకులు రమేష్, మహేందర్, రాంరెడ్డి, మురళి, రమేష్, సురేందర్, రాజ్ కుమార్, రాజేందర్, సుధాకర్, రాజేశం, శ్యామ్ బాబు, జూనియర్ అకౌంట్స్ అధికారి శ్రీనివాస్ బాబు, 1104 యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-బెజ్జూర్

బెజ్జూర్ ఎంపీడీఓగా ప్రవీణ్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సూపరింటెండెంట్‌గా పని చేసిన ప్రవీణ్ కుమార్‌కు ప్రభుత్వం బెజ్జూర్ ఎంపీడీఓగా నియమించడంతో ఆయన ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని మండల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు.



కొత్త రహపెల్లిలో అగ్నిప్రమాదం

- రూ. 5 లక్షల ఆస్తి నష్టం
- బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని కొత్త రహపెల్లిలో బుధవారం మధ్యాహ్నం సెండే బాపు, సెండే అన్నారవ్, అనంతరావ్ ఇండ్లతో పాటు వినాయకరావ్‌కు చెందిన షెడ్ అగ్నికి ఆహుతయ్యాయి. ఇంటి యజమానులు ప్రమాద సమయంలో లేకపోవడంతో ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ఇంటి పక్కన వాళ్లు గమనించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో కాగజ్‌నగర్ నుండి మూడు ఫైర్ ఇంజన్లు వాచీలు మంటలు ఆర్పివేశాయి. ఫైర్ అధికారి భీమయ్య వివరాలు తెలుపుతూ దాదాపు రూ.5 లక్షల ఆస్తి నష్టం జరిగిందని, రెండు సిలిండర్లు పేలిపోయాయని తెలిపారు. మంటలు ఆర్పే ప్రక్రియలో లీడ్ ఫైర్‌మ్యాన్ విజయ్ కుమార్‌తో పాటు ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ఇండ్లు అగ్నికి ఆహుతయాయని తెలుసుకున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌తో కలిసి అక్కడికి చేరుకొని వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు చేతికి వచ్చిన పత్తి పంట అగ్నికి ఆహుతి కావడం పట్ల ఎమ్మెల్యేకు గోడు వినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. తక్షణ సహాయం కింద ఒక్కరికి రూ.5000 చొప్పున నగదు అందజేయడంతో పాటు నూతన వస్త్రాలు, సుమారు రూ.50,000 విలువగల తిండి సరుకులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



ఈఎస్ఐ ఆస్పత్రిని పరిశీలించిన ముఖ్య కార్యదర్శి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రిని బుధవారం కార్మిక ఉపాధి కల్పన శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. అనంతరం సూపరింటెండెంట్ ఛాంబర్‌లో ఉద్యోగులతో మాట్లాడారు. ఆస్పత్రి నూతన భవన నిర్మాణం, ఉద్యోగుల తరలింపుపై ఉద్యోగులు ముఖ్య కార్యదర్శిని అడగగా, ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కొన్నేండ్లుగా తాము ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పరుచుకున్నామని, ఈ సమయంలో ఆస్పత్రిని ఇక్కడి నుండి తరలించి తమను బదిలీ చేయరాదని వారు ముఖ్య కార్యదర్శికి తమ సమస్యలు చెప్పుకున్నారు. దీనికి ముందు ఆస్పత్రి సూపరింటెండెంట్ జగన్‌తో పాటు ఉద్యోగులు ఆయనను సన్మానించారు. ఆయన వెంట జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి రమాదేవి, డీఆర్‌డీఓ లోకేశ్వర్, అడిషనల్ డీఆర్ఓ రామకృష్ణ, తహసీల్దార్ కిరణ్ ఉన్నారు.

17 నుంచి విధుల బహిష్కరణ : ఏఐటీయూసీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17 నుంచి విధులు బహిష్కరిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ తెలిపారు. కార్మికులతో కలిసి జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సుభాష్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్(ఏరియా) ఆస్పత్రి శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న 4 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో ఈనెల 17 నుంచి విధులు బహిష్కరించి నిరసన చేస్తామన్నారు. జనవరి 20న హాస్పిటల్ సూపరింటెండెంట్‌కి వేతనాలు చెల్లించాలని వినతిపత్రం ఇచ్చామని, ఇప్పటివరకు దాని ఊసే లేదన్నారు. కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లిన బిల్స్ రావడం లేదని చెప్పుతున్నారని, దీంతో కార్మికులు సతమతమవుతూ కుటుంబాన్ని పోషించుకోలేక రోడ్డు మీద పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలను కాంట్రాక్టర్లను రద్దుచేసి గ్రీన్ ఛానల్ ద్వారా ఒకటవ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఈపీఎఫ్, ఈఎస్ఐ పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది గుణవంత్‌రావ్, మమత, మల్లేష్, మురళి, ప్రేమలత, జ్ఞానేశ్వర్, శ్రీశైలం, కిష్టయ్య, హైమద్, రాజయ్య పాల్గొన్నారు.

జీఓ 317 సమస్య పరిష్కరించే వారికే మద్దతు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారిన 317 జీఓ బాధితుల సమస్య పరిష్కరించే వారికే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు తెలుపనున్నట్లు 317 జీఓ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గుండి పాఠశాలలో 317 జీఓ బాధితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ ఆదిలాబాద్ నిజాంబాద్ మెదక్ నియోజకవర్గ పరిధిలో 8000 మంది 317 జీఓ బాధితులు ఉన్నారన్నారు. రానున్న ఉపాధ్యాయ ఎన్నికల్లో తమ ఓట్లు కీలకం కానున్నాయని, బాధితులు ఏక తాటిపై ఉండి తమ సమస్య పరిష్కారం కోసం కృషి చేసే వారికి ఓటు వేయాలని సూచించారు. ప్రభుత్వం సమస్య పరిష్కారం కోసం స్పష్టమైన హామీ ఇస్తే తమ మద్దతు పూర్తిగా ప్రభుత్వానికే ఉంటుందని తెలిపారు. 317 జీఓతో రానున్న రోజుల్లో తమ కుటుంబాలు స్థానికత కోల్పోవాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయిన నేపథ్యంలో తమ సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా గురు రవిదాస్ మహారాజ్ జయంతి

నవతెలంగాణ-వాంకిడి

భారతీయ బౌద్ధ మహాసభ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో సంత్ గురు రవిదాస్ మహారాజ్ 648వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాహుల్కర్ మాట్లాడుతూ సంత్ రవిదాస్ మహారాజ్ నిరుపేద కుటుంబంలో జన్మించిన నీతి నియమాలు, దైవభక్తితో పాటు సమాజంలో అంటరానితనాన్ని దూరం చేయడానికి నిరంతరం కృషి చేశారని, అణగారిన కులాలకు విద్య ప్రాముఖ్యతను చాటి చెప్పారన్నారు. అంతకుముందు బుద్ధవంధనంతో కార్యక్రమాన్ని ప్రారంభించి శరణతాయ్‌తో ముగించారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా ఆర్గనైజర్ ఉప్రె విజయ్, సమతా సైనిక దళ్ జిల్లా ఇన్‌చార్జి దుర్గం సందీప్, మండల భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షుడు ఉప్రే జయరాం, జాడే పాండుజీ, అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు దుర్గం హంసరాజ్, బౌద్ధ సమాజ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, సిద్ధార్థ యువజన సంఘం అధ్యక్షుడు మహేష్, సమతా భారతి ఐక్యవేదిక నాయకులు డోంగ్రి రవీందర్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దుర్గం పెంటు,రోషన్, అరుణ్, ప్రతాప్,రమేష్ పాల్గొన్నారు.



బియ్యం అక్రమ రవాణ సమాచారాన్ని చేరవేశాడనే నెపంతో దాడి

- ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్‌లో బియ్యం అక్రమరవాణ హింసాత్మక ఘటనలకు దారి తీస్తోంది. బియ్యం అక్రమ రవాణాదారులు పెరగడం, వారిలో వారికే మనస్పర్థలు వచ్చి కొట్టుకునే స్థాయి వరకు చేరుకుంటున్నాయి. కాగజ్‌నగర్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఘటనను ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. మంగళవారం కాగజ్‌నగర్ నుండి మహారాష్ట్రకు బియ్యం అక్రమరవాణ జరుగుతుండగా పోలీసులు పట్టుకొన్న విషయం తెల్సిందే. ద్వారకానగర్‌కు చెందిన అక్రం ఖాన్ అనే వ్యక్తే పోలీసులకు ఈ విషయాన్ని చేరవేసి పట్టించాడని కక్ష కట్టిన ఫారూఖ్, రాజిక్, సాదిక్‌లు రాత్రి స్థానిక బాలభారతి పాఠశాల సమీపంలో అక్రం ఖాన్‌ను చితకబాదారు. బాధితుడు అక్రం ఖాన్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

రంగరాజన్‌పై దాడి అనాగరికం



నవతెలంగాణ-కెరమెరి

చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ సుజాయిత్ ఖాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్చకుడిపై దాడికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. దాడి అన్యాయం, అనాగరికమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడి అదుపు తప్పుతున్న మతోన్మాద సంస్కృతికి నిదర్శమని పేర్కొన్నారు. హిందూ ధర్మ రక్షణ పేరిట రాజ్యాంగ స్ఫూర్తికి, లౌకికతత్వానికి, ప్రజాస్వామ్య, సౌభ్రాతృత్వ భావనలకు విరుద్ధంగా పనిచేసే సంస్థలను ఉపేక్షించొద్దని కోరారు. మత సామరస్య వాతావరణాన్ని దెబ్బతీసే వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక చట్టాలను రూపొందించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సమ్మక్క- సారక్క జాతర



నవతెలంగాణ-తిర్యాణి

సమ్మక్క సారక్క మినీ జాతరను పురస్కరించుకొని మండల కేంద్రంలో బుధవారం సమ్మక్క-సారక్క బోనాల జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అరటిపల్లి స్టేజి వద్ద కొలువుదీరిన సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్దకు బోనాలతో బయలుదేరి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రసాదాలను సమర్పించారు. ప్రజలు సుఖంగా ఉండాలని అమ్మవార్లను కోరుతూ మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు బొమ్మగోని సత్య గౌడ్, కరిగంటి బాపు, భక్తులు కరుగంటి రమేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులతోనే అల్పాహారం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ నిధులతోనే అల్పాహారం అందిస్తున్నామని జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు చింత సదాశివుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓ దిన పత్రికలో మాత్రంలో ఎమ్మెల్సీ ఔదార్యం విద్యార్థులకు అల్పాహారం ఇస్తున్నామని రాయడం సరైంది కాదన్నారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విటల్ నియోజకవర్గంలో ఉన్న జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో జనవరి మాసంలో పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేవారని తెలిపారు. ప్రస్తుతం జనవరి 31 నుండి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి మార్చి మాసం వరకు ప్రభుత్వ నిధులతో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు ప్రకారం అల్పాహారం అందిస్తున్నట్లు వివరించారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని బీబ్రా గ్రామంలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సహిత సద్గురు సాయినాథ దేవాలయంలో బుధవారం వేదపండితులు బాచంపల్లి కిషోర్ శర్మ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవా, పాలాభిషేకం చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాజీ సర్పంచ్ కొలిపాక రమేష్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఇంద్రసేన ప్లే స్కూల్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం మహిళలు కోలాటం అనంతరం పల్లకి సేవా, ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు.

జిల్లా అసోసియేట్ అధ్యక్షుని నియామకం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అసోషియేట్ అధ్యక్షునిగా పత్తిపాక శ్రావణ్‌కుమార్‌ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాస్‌రావు, సునార్కర్ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఇతన్ని నియమించినట్లు పేర్కొన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా పంటల నమోదు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని వివిధ గ్రామాల శివారులో డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా పంటల వివరాలను నమోదు చేస్తున్నామని పోన్కల్ ఏఈఓ త్రిసంధ్య తెలిపారు. బుధవారం పోన్కల్ గ్రామ శివారులో సర్వే నంబర్లు, సబ్ డివిజన్ నంబర్ల వారీగా పంటల సాగు విస్తీర్ణం, పంట రకం, సాగు విధానం, నీటి వసతి వివరాలను నమోదు చేశారు. రైతులు వివరాలను ప్రత్యేక యాప్‌లో పొందుపరిచారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలు అవసరం

నవతెలంగాణ-కాసిపేట



ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు అవసరమని దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం దేవాపూర్‌లోని గొల్లవాడలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఉండటం వల్ల ఎటువంటి నేరాలు జరిగినా వెంటనే గుర్తించడానికి వీలుగా ఉంటుందన్నారు. చాలా కేసుల్లో నేరస్తులను గుర్తించడానికి చాలా ఉపయోగపడ్డాయన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షలో కిష్టాపూర్ విద్యార్థుల సత్తా



నవతెలంగాణ-జన్నారం

గత సంవత్సరం నవంబర్‌లో నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షలో కిష్టాపూర్ విద్యార్థులు సత్తాచటారు. ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి మొదటి, రెండవ ర్యాంకులతో పాటు మొత్తం 11 మంది ఈ స్కాలర్‌షిప్‌లను గెలుచుకొని పాఠశాలను జిల్లాలో ప్రథమ స్థానంలో నిలబెట్టారు. ఈ సందర్భంగా విజేతలతో పాటు పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారి, సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాధికారి, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షులు గ్రామ ప్రముఖులు అభినందించారు. ఈ విజయంతో విద్యార్థులు నాలుగు సంవత్సరాల పాటు ఏటా రూ.12,000 స్కాలర్‌షిప్ గెలవడంతో పాటు తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకున్నట్టు ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న తెలిపారు. ఇది పాఠశాల ఉపాధ్యాయుల సమిష్టి కృషి వల్ల సాధ్యమైందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేలాలలో మొదలైన జాతర ఏర్పాట్లు

- రోడ్డు నిర్మాణపు పనులను పర్యవేక్షించిన ఎస్సై



నవతెలంగాణ-జైపూర్

మహా శివరాత్రిని పురస్కరించుకుని వేలాలలో మూడు రోజుల పాటు కొనసాగనున్న మల్లిఖార్జున స్వామి జాతర ఏర్పాట్లు మొదలయ్యాయి. వాహనాల పార్కింగ్ ఏరియా, రోడ్డు పనులను ఎస్సై శ్రీధర్ బుధవారం పర్యవేక్షించారు. అదేవిధంగా గోదావరి నది తీరంలో ఏర్పాటు చేయనున్న స్నాన ఘట్టాన్ని పరిశీలించి ప్రమాదాలకు తావివ్వకుండా నీటి నిల్వలను ముందస్తుగా పరిశీలించారు. పార్కింగ్ ఏరియాలోకి వాహనాల రాకపోకలకు నిర్మిస్తున్న రోడ్డును పరిశీలించారు. గ్రామ సరిహద్దుల్లో వాహనాలను కట్టడి చేసి జాతర ఏరియాలో రద్దీని క్రమబద్ధీకరించే విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎస్సై తెలిపారు. జాతరలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ఎక్కడికక్కడ ట్రాఫిక్ కట్టడికి చర్యలు చేపడుతున్నామని వివరించారు. మల్లిఖార్జున స్వామి దర్శనార్థం వచ్చే భక్తులు తిరిగి క్షేమంగా ఇంటికి చేరాలని ఆకాంక్షిస్తూ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలు, సలహాలు, సూచనలకు అనుగుణంగా బందోబస్తు ఏర్పాట్లు కొనసాగనున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

ఫిల్టర్ బోర్ల ద్వార స్నాన ఘట్టానికి గోదావరి నీరు: ప్రత్యేక అధికారి విద్యాసాగర్

వేలాల జాతరకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే ఉన్న రెండు ఫిల్టర్ బోర్లతో పాటు మరో రెండు ఫిల్టర్ బోర్లు ఏర్పాటు చేసి స్నాన ఘట్టానికి గోదావరి నీరు అందుబాటులోకి తెస్తున్నట్లు వేలాల గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ విద్యాసాగర్ తెలిపారు. నేరుగా గోదావరి నదిలో స్నానాలు ఆచరించే వారిని దృష్టిలో ఉంచుకొని గోదావరి నీటి వరద నీటి పాయను పుష్కరఘాట సమీపంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. గట్టు మల్లన్న గుట్ట పరిసర ప్రాంతంలో సైతం వాహనాల పార్కింగ్ ఏరియా చదును చేస్తున్నట్లు తెలిపారు.

నర నారాయణ స్వామి ఆలయంలో జాన్సన్ నాయక్ పూజలు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు గ్రామంలో గల శ్రీ నర నారాయణస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆలయంలో బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్ నాయక్, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి కాకరయ్య, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్ రావు వారికి స్వాగతం పలికి శాలువ, పూలమాలలతో సత్కరించారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలందరూ సుభిక్షంగా వర్ధిల్లాలని స్వామి వారిని కోరుకున్నట్టు తెలిపారు. కార్యక్రమం మండల మాజీ కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి భరత్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, జిల్లా నాయకులు ఫజాల్ ఖాన్, మండల యూత్ అధ్యక్షులు పేరం శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు సంతోష్, శ్రీకాంత్ రెడ్డి, ఓల్లాల నర్సాగౌడ్, సాగవిక్రమ్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సాంకేతిక సమస్య కారణంగా పత్తి కొనుగోలు నిలిపివేత

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ఈ నెల 10వ తేదీ ఉదయం నుండి ఆధార్ సర్వర్ సాంకేతిక సమస్య కారణంగా సీసీఐ పత్తి కొనుగోలు నిలిపివేయడం జరిగిందని జిల్లా మార్కెటింగ్ అధికారి ఎండి.షాబొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయు సమయంలో పత్తి రైతుకు ఆధార్ ప్రామాణికం కావడం లేదని, ఈ కారణంగా వ్యవసాయ మార్కెట్ యార్డు చెన్నూర్, బెల్లంపల్లి, లక్షెట్టిపేటలో పత్తి కొనుగోళ్ళు తాత్కాలికంగా నిలిపివేయడం జరిగిందని తెలిపారు. ఆధార్ సర్వర్ పున్నరుద్ధరణ తరువాత పత్తి కొనుగోలు విషయాన్ని పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తామని, రైతులు ఈ విషయాన్ని గమనించి మార్కెట్ యార్డుకు పత్తిని తీసుకురావద్దని కోరారు.

నిర్దేశించిన ఉత్పత్తి దిశగా ముందుకెళ్లాలి

- సింగరేణి చైర్మన్ అండ్ డైరెక్టర్ బలరాం



నవతెలంగాణ-నస్పూర్

ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన 70మిలియన్ టన్నుల ఉత్పత్తి దిశగా ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం అన్నారు. బుధవారం డైరెక్టర్ ఆపరేషన్ సూర్యనారాయణ, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కె.వెంకటేశ్వర్లుతో కలిసి శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7, ఆర్కే న్యూటెక్, ఆర్కే-6, ఆర్కే-5, ఎస్ఆర్పీ సీహెచ్‌పీ, ఎస్ఆర్పీ ఓసీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు వారికి కేటాయించిన విధులను తప్పనిసరిగా ఎనిమిది గంటల సమయంలో నిర్వర్తించాలని, భారీ యంత్రాల వినియోగ సమయం పెంచాలని సూచించారు. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు తప్పనిసరిగా హాజరవుతూ నిర్దేశిత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని, సూపర్‌వైజర్లు, మైనింగ్ సిబ్బంది, కోల్ కట్టర్, సపోర్ట్ మెన్, వివిధ కేటగిరీలలో పనిచేస్తున్న ఉద్యోగులతో చైర్మన్ మాట్లాడి వారికి కావాల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. సంస్థలో మహిళా ఉద్యోగులు పెరుగుతున్న సందర్భంగా వారికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను సంస్థ చేస్తుందని, అలాగే మహిళా ఉద్యోగులు ఉత్పత్తి ఉత్పాదకతకు కృషి చేయాలన్నారు. వారు వివిధ కేటగిరీల ఉద్యోగాలను చేస్తూ ఉండాలని, భూగర్భంలో కూడా దిగి సంస్థ ఉత్పత్తి ఉత్పాదకు తోడ్పడాలని సూచించారు. సంస్థలో చేరిన మహిళలకు ఏపీ ఆపరేటర్లుగా వెళ్లడానికి అవకాశం ఉందని దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూగర్భ గనిలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరు రక్షణతో కూడిన ఉత్పత్తిపాదకత దిశగా పని చేయాలనీ, ఆర్కే న్యూటెక్ గని భూగర్భ గనిలో దిగి గనిలో పనిచేస్తున్న ఉద్యోగులతో మాట్లాడారు. అలాగే గని ప్లాన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ జనరల్ మేనేజర్ టి.శ్రీనివాస్, ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కే.వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్కే-7 గ్రూప్ ఏజెంట్ కె.రాజేందర్, ఆర్కే-5, 6 గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, డీజీఎం పర్సనల్ పి.అరవింద రావు, ఆర్కే న్యూటెక్ మేనేజర్ స్వామి రాజు, సీహెచ్‌పీ ఇన్‌చార్జీ డీజీఎం చంద్రలింగం, ఆర్కే-7, 6, 5 మేనేజర్లు తిరుపతి, ఈ.తిరుపతి, సుధీర్ కుమార్ ఝా, సీనియర్ పీఓ పి.కాంతారావు, గుర్తింపు సంఘం యూనియన్ నాయకులు ముస్కె సమ్మయ్య, వీరభద్రయ్య పాల్గొన్నారు.

కోళ్లలో బర్డ్ ఫ్లూ లక్షణాలు, మరణాలు లేవు

- మండల పశు వైద్యాధికారి డా.కస్తూరి శ్రీకాంత్



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని వివిధ గ్రామాల్లోని కోళ్ల ఫాంలను బుధవారం పరిశీలించడం జరిగిందని, కోళ్లలో ఎలాంటి బర్డ్ ఫ్లూ లక్షణాలు, మరణాలు కూడా లేవని మండల ప్రభుత్వ పశువైద్యాధికారి డా.కస్తూరి శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా ఈ వైరస్ సంచార జాతి పక్షులు, అడవులలో సంచరించే పక్షుల వలన సంభవిస్తుందన్నారు. ఈ వైరస్ వచ్చిన తర్వాత వేల సంఖ్యలో కోళ్లలో లక్షణాలు ఏర్పడి ఒక పక్షి నుంచి మరో పక్షికి వ్యాప్తి చెంది అన్ని పక్షులకు వ్యాపిస్తుందన్నారు. ఒక ఫారంలో ఒకేరోజు ఎక్కువ కోళ్లు చనిపోతే వెంటనే ఆ యజమానులు వేరే కోళ్లకు వాటిని దూరంగా ఉంచాలన్నారు. చనిపోయిన కోళ్లను చేతులతో పట్టుకోకుండా గోనె సంచులలో తీసుకెళ్లి, ఊరి బయట పూడ్చి పెట్టాలన్నారు. లేదా వాటిని పూర్తిస్థాయిలో కాల్చివేయాలన్నారు. కోళ పెంచే షెడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ వ్యాధికి చికిత్స వ్యాక్సిన్ లభ్యతలో లేదన్నారు. ముందస్తు జాగ్రత్తలు [illegible] తీసుకోవాలని, కోళ్ల ఫారం యజమానులకు సూచించారు. కోళ్లు ఎలాంటి కారణం చేతనైనా మరణిస్తే వెంటనే పశువైద్య కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అలాగే చనిపోయిన కోళ్లను తినడం ప్రమాదకరమన్నారు. వ్యాధి సోకున కోళ్లను వాటి గుడ్లను తినకూడదని ప్రజలకు సూచించారు. ప్రస్తుతం మండలంలో ఎలాంటి బర్డ్ ఫ్లూ వ్యాధి లేదని తెలిపారు.

ఘనంగా 1104 యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

విద్యుత్ శాఖ ఉద్యోగుల 1104 యూనియన్ 75వ ఆవిర్భావ సబ్‌స్టేషన్‌లో యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ 1104 యూనియన్ కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో ముందుంటుందన్నారు. ఐక్యంగా ఉంటూ యూనియన్ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఫోర్‌మెన్ మెట్టు రాజేశ్వరరావు, నర్సింగ రావు, శంకరయ్య, చంద్రమౌళి, రాజమౌళి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జన్నారం : టీఈఈ విద్యుత్ 1104 యూనియన్ 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డైమండ్ జూబ్లీ ఉత్సవాలను బుధవారం జన్నారం సబ్ స్టేషన్ ఎదుట కార్మికులు ఘనంగా నిర్వహించారు. యూనియన్ జెండాను విద్యుత్ ఎస్ఎల్ఐ జయప్రకాష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ 1104 యూనియన్ ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. యూనియన్ పూర్తిగా అభివృద్ధి, కార్మికులకు అండగా ఉంటుందన్నారు. అనంతరం విద్యుత్ కార్మికులు మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో విద్యుత్ కార్మికులు శ్రీనివాస్, సాయి, మల్లేష్, రమేష్, విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్ఓ



నవతెలంగాణ-మందమర్రి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు జాతీయ ఆరోగ్య మిషన్, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని సమయపాలన పాటించాలని, ఆస్పత్రిలోని గదులన్నీ శుభ్రంగా ఉంచాలన్నారు. ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన వైద్యులు సిబ్బంది వివరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మ్యాప్ ఉంచాలని, స్త్రీ పురుషుల వార్డులు వేరువేరుగా ఉంచాలని సూచించారు. వ్యాక్సినేషన్ ఉపయోగించే వ్యాక్సిన్ క్యారియర్లను అందుబాటులో ఉంచుకోవాలని, పాడైన వస్తువులను ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో నిర్ణయించి తీసివేయాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నేషనల్ క్వాలిటీ అస్సూరెన్స్ కోసం తయారు చేయాలని, కేంద్రానికి స్థలం ఉన్నందున పచ్చదనం పరిశుభ్రత ఏర్పాటు చేయాలని, క్వార్టర్లను వారంలో శుభ్రం చేయించాలని ఆదేశించారు. అందుబాటులో ఉంటూ ప్రజాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు రమేష్, మాస్‌మీడియా అధికారులు బుక్క వెంకటేశ్వర్, వెంకట సాయి, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కాంటా చౌరస్తాలో జనహిత అన్నదానం

నవతెలంగాణ-తాండూర్

జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని ఆకలితో ఉన్నవారి ఆకలి తీర్చడం సంతృప్తినిస్తుందని తెలిపారు. అన్నదాన కార్యక్రమాన్ని 2021 ఏప్రిల్ 13న ప్రారంభించామని తెలిపారు. దాతల సహకారంతో ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనహిత సేవా సమితి కార్యవర్గ సభ్యులు దాసరి నరేష్ గౌడ్, నిచ్చకోల గురుస్వామి, పాల్గొన్నారు.

పిల్లలు, మహిళల సంక్షేమం దిశగా చర్యలు



నవతెలంగాణ-నస్పూర్

పిల్లలు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ట్ విజయ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఫైనాన్స్ లిటరసీ కార్యక్రమ ప్రతినిధి లిప్సికతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలిక రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన భేటీ బచావో- భేటీ పడావో కార్యక్రమం 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. చట్టాల గురించి తెలుసుకోవాలని, ఆడ పిల్లల ప్రాముఖ్యత గురించి, మహిళా సాధికారత అంశాలపై వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

ముత్యంపల్లి క్రీడా మైదాన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ముత్యంపల్లి క్రీడా మైదానం(మినీ స్టేడియం) కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా పూస్కూరి విక్రమ్ రావు, అధ్యక్షుడిగా బోయిని తిరుపతి, ఉపాధ్యక్షుడిగా మైదం రమేష్, దాసరి అజయ్, ప్రధాన కార్యదర్శిగా మెరుగు శ్రీనివాస్, కార్యదర్శులుగా సాయి చిన్న, గుమ్ముల అశోక్, కోశాధికారిగా దుగుట భార్గవ్, ఉప కోశాధికారిగా పెంద్రం శంకర్, సహాయ కోశాధికారిగా జాడి శివ, ముఖ్య సలహాదారుగా మద్యవేణి అర్జున్, జాడి గునేందర్, టెక్నికల్ ఇన్‌చార్జి జాడి అఖిలాశ్, ప్రచార కార్యదర్శిగా గోలేటి స్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలో ఏకైక ముత్యంపల్లి క్రీడా మైదాన అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులు తెలిపారు.

డ్రగ్స్ బారిన పడి భవిష్యత్తు నాశనం చేసుకోవొద్దు : ఎస్సై



నవతెలంగాణ-నస్పూర్

డ్రగ్స్ బారిన పడి బాలబాలికలు బంగారు భవిష్యత్తు నాశనం చేసుకొవొద్దని నెన్నెల ఎస్ఐ ప్రసాద్ అన్నారు. బుధవారం మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధులు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నెన్నెల మండలం అవడం ప్రభుత్వ పాఠశాలలో యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రసాద్, ఎక్సైజ్ ఎస్సై శంకర్, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ సందీప్ మాట్లాడుతూ బాలబాలికలు డ్రగ్స్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ తీసుకోవడం వలన వారి భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. పరిసరాలలో వేరే ఇతర ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నట్టు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్ హెల్ప్ లైన్ నెంబర్ 14446 కాల్ చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల యంత్రాంగం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11:30 గంటలకు 2వ విడత సాధాకణ ఎన్నికలు 2025కు సంబంధించి ఎంపీటీసీ, జడ్పీటీసీల వారీగా డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల జాబితాపై గురువారం రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకుల అభ్యంతరాలు, సలహాలు, సూచనలు స్వీకరించడం జరుగుతుందన్నారు. పార్టీల నాయకులు సకాలంలో హాజరు కావాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ కోరారు.

బెజ్జూర్ రేంజ్‌ను సందర్శించిన ట్రైనీ సెక్షన్ అధికారులు

నవతెలంగాణ-బెజ్జూర్



బెజ్జూర్ రేంజ్‌ను హైదరాబాద్ దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్ ఎం.రామ్మోహన్ బుధవారం సందర్శించారు. హైదరాబాదులో దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో సెవెంత్ బ్యాచ్ శిక్షణ పొందుతున్న 32 మంది సెక్షన్ అధికారులతో కలిసి బెజ్జూరు రేంజ్‌లో పర్యటించారు. రేంజ్‌లోని మత్తడి ఏరియా, పులి కదలికలు, అడుగులను చూశారు. సహజసిద్ధమైన అటవీ ప్రాంతాలను పరిశీలించారు. ఆయన వెంట బెజ్జూర్ డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్ కుమార్, బీట్ ఆఫీసర్లు వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.

యజమానులకు నష్టపరిహారం అందజేత

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండలంలోని హుడికిలి గ్రామానికి చెందిన దండ్రే లాలాజీ, చీలపల్లి గ్రామానికి చెందిన గోనె శ్రీను ఆవులు సమీప అటవీప్రాంతంలో మేతకు వెళ్ళి పెద్దపులి దాడిలో మరణించాయి. వీటికి సంబంధించి రైతులు నష్టపరిహారానికి దరఖాస్తు చేయగా ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీంతో మంజూరైన నష్టపరిహారాన్ని ఎఫ్ఆర్ఓ ఇక్బాల్ బాధిత రైతులకు అందించారు. పశుయజమానులు దండ్రే లాలాజీకి రూ. పదివేలు, గోనె శ్రీనుకి రూ.18వేలు నష్టపరిహారం ఇచ్చామన్నారు. అడవి జంతువుల దాడిలో పశువులు చనిపోతే వెంటనే సమాచారం అందించాలని, వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టవద్దని తెలియజేశారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ మోహన్ రావు, బీట్ ఆఫీసర్ సంతోష్ పాల్గొన్నారు.

అడవులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు

- ఎఫ్ఆర్ఓ మజారుద్దీన్



నవతెలంగాణ-కెరమెరి

అడవులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎఫ్ఆర్ఓ మజారోద్దీన్ అన్నారు. అడవుల సంరక్షనపై బుధవారం మండలంలోని ఉమ్రి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అడవులతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. గ్రామస్తులకు అటవీ జంతువుల పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అడవుల సంరక్షణకు ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎవరైనా అక్రమంగా కలప తరలిస్తే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టకూడదని అది పర్యావరణానికి ముప్పు కలిగిస్తుందని తెలిపారు. అటవీ జంతువుల సంరక్షణ వల్ల పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పంట పొలాల్లో పత్తి, కంది కర్రలను చేన్లలో కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

డైనింగ్ హాలు లేక చెట్టు కింద భోజనం



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల బాలురు ఉట్నూర్‌లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు భోజనం చేసేందుకు డైనింగ్ హాలు లేక చెట్టు కింద భోజనాలు చేస్తున్నారు. చెట్టు నీడ, బిల్డింగ్ నీడనే తమ దిక్కవుతుందని పేర్కొంటున్నారు. తమకు డైనింగ్ హాల్‌ను కేటాయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకుడు

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బండె బాలేష్ బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గురునులె నారాయణ ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన ఆయనకు శాలువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండె బాలేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

జిల్లా కేంద్రానికి చేరిన ప్రపంచ శాంతి సైకిల్ యాత్ర

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ పర్యావరణ పరిరక్షణ చేయాలంటూ మణుగూరు డిపోలో ఆర్టీసీ కార్మికుడిగా పనిచేసి రిటైర్డ్ అయిన కృష్ణ భద్రాచలం నుండి ప్రయాగ్‌రాజ్ వరకు చేపట్టిన సైకిల్ యాత్ర జిల్లా కేంద్రానికి చేరుకుంది. బుధవారం ఆ యాత్రను యువకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల వినియోగం పెరగడంతో కాలుష్యం విపరీతంగా పెరిగిందని తక్కువ దూరానికి సైకిల్ వాడడంతో పాటు ఎక్కువ దూరానికి బస్, రైలు వాడకం వల్ల వాతావరణ కాలుష్య నివారణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా యువకులు పాల్గొన్నారు.

మోచీ సంఘం అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రానికి చెందిన మోచి సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఓటాకర్ రాజశేఖర్‌ను బోథ్ పట్టణానికి చెందిన తన మిత్రులు ఆయనను బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో మెరుగు భోజన్న, అప్పాల శ్రీనివాస్‌రెడ్డి, కురుమే మహేందర్, భారే నాగేందర్, మెరుగు శ్రీనివాస్, బీరం చంద్రమోహన్, లాడి గిరీష్, ఆడేపు కిరణ్, గంగుల మల్లేష్, బొజ్జ సాయన్న, భీమ గంగమల్లు పాల్గొన్నారు.

ఏజీపీగా బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-ఖానాపూర్

నిర్మల్ కోర్టు ఏజీపీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన న్యాయవాది ఆసిఫ్ అలీ బుధవారం జేసీజే కోర్టు జడ్జీ పి.అజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏజీపీ వెంట నిర్మల్ జిల్లా జీపీ శుభకరణ్, న్యాయవాదులు రమణగౌడ్, మొహమ్మద్ ఖాజా, రమణరావు, రత్నం ఉన్నారు.

టెర్రస్‌పై కూరగాయల సాగు

- పరిసరాల్లో పూలు మొక్కలు, పండ్ల చెట్లు





నవతెలంగాణ-జైపూర్

కుటుంబ పెద్దకు తోడు కుటుంబ సభ్యుల కృషి ఫలితంగా టెర్రస్ కాస్త వ్యవసాయ క్షేత్రంగా మలిచారు సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంతులా నాయక్. టెర్రస్ పైనే కాకుండా పరిసరాలను వదలకుండా పండ్లు, పూల మొక్కలు పెంచుతున్నాడు. ఎలాంటి రసాయనాలు వాడకుండా సేంద్రియ విధానంలో ఇంటికి సరిపోను ఆకు కూరలతో పాటు కూరగాయలు సాగు చేస్తున్నారు.

పర్యావరణ ప్రేమికుడిగా..

ఎస్టీపీపీ టౌన్ షిప్‌లో తనకు కేటాయించిన బంగ్లాను పచ్చని పొదరిల్లుగా మార్చుకున్నారు. పర్యావరణాన్ని ప్రేమించడమే ప్రర్యావరణాన్ని పరిరక్షించుకోవల్సిన అవసరం అంటున్నారాయన. పర్యావరణాన్ని పెంపొందించే దశగా ఇతరులను ప్రేరేపితులను చేయాలన్న సంకల్పంతో ఇంటి చుట్టు ఏ మాత్రం స్థలం ఉన్నా వదలలేదు. రకరకాలైన పండ్ల చెట్లను పెంచుతున్నారు. 2018 నుండి ప్రతి సంవత్సరం నిర్వహించే సింగరేణి దినోత్సవంలో ఆయన ఉత్తమ పర్యావరణ హౌస్ అవార్డులు అందుకుంటున్నారు. ఏకంగా ఏడు సార్లు ఉత్తమ పర్యావరణ హౌజ్ అవార్డు అందుకోవడం గమనార్హం.

ఆరోగ్యకరమైన జీవనం

మార్కెట్‌లో విక్రయించే పండ్లు, కూరగాయల్లో దాదాపుగా ఎక్కువగా రసాయనాలు వాడి పండించినవే ఉంటున్నాయి. అందుకుని వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆయన ఇంటికి సరిపడా కూరగాయలు ఇంటి వద్దే పండించుకోవాలని అనుకున్నారు. కూరగాయలు, ఆకుకూరలు పెంచడం మొదలు పెట్టారు. కుటుంబ సభ్యులు తోడ్పాటుతోడవడంతో ఇంటి పరిసరాల్లో పండ్లు, పూల మొక్కలను, ఉద్యోగులకు కేటాయించిన క్వార్టర్ల మధ్యన గల ఖాళీ ప్రదేశంలో మామిడి, జామ, వాటర్ ఆపిల్, సపోటా, బొప్పాయి తదితర సీజనల్ పండ్ల మొక్కలను పెంచుతున్నట్లు చెప్పున్నారు. ఇండోర్, అవుట్‌డోర్ మొక్కలతో సహజ సిద్ధమైన గాలి వెలుతురు, సేంద్రియ విధానంలో పండిస్తున్న కూరగాయలతో ఆరోగ్యకరమైన జీవనం, ఆహ్లాదకర వాతావరణం లభిస్తోందని అంటున్నాడు. టెర్రస్ పై పెంచుతున్న చెట్లతో పగటి ఉష్ణోగ్రతల ప్రభావం అంతగా ఉండటం లేదని, ఇంట్లో ఎయిర్ కండీషనర్ అవసరం లేకుండా చల్లని గాలి వస్తోందని అంటున్నారు.

వ్యర్థాలతో సేంద్రియ ఎరువు..

రోజు వారి విధులకు వెళ్లి వచ్చే తనకు కుటుంబ సభ్యులు సహకారం అందిస్తుండటంతో సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నానంటున్నారాయన. భార్య దరావత్ నీలిమ వంట గది మిగులు వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మల్చుతున్నారు. దీంతో టెర్రస్‌పై దొండకాయ, వంకాయ, టమాట, పచ్చి మిర్చి, క్యాప్సికంతో పాటు ఆకు కూరలు, పాల కూర, తోట కూర, గంగవాయిలి, కోతిమీర, పుదినా, తోట కూరలను పండిస్తున్నట్లు పేర్కొంటున్నారు.

వ్యవసాయ కుటుంబంలో ఎదిగి.. సింగరేణిలో ఒదిగి

వ్యవసాయ కుటుంబానికి చెందిన పంతులా నాయక్ సింగరేణిలో జూనియర్ ఎగ్జిక్యూటీవ్ ట్రైనర్‌గా ఉద్యోగంలో చేరారు. ప్రస్తుతం జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో డీజీఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. వ్యవసాయం కుటుంబంలో పుట్టిన ఆయన సొంతగా పంటలు పండించడంలో అనుభవం, స్వయంగా పండించుకున్న పంటలను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని గుర్తించి టెర్రస్‌ను వ్యవసాయ క్షేత్రంగా మల్చుకున్నారు. ఆ పర్యావరణ పరరిక్షణ పట్ల ఇతరులను ప్రేరేపితులను చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.







ప్రతి మండలంలో అర్జీలు స్వీకరించి పరిష్కరిస్తాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి మండలంలో ఎంపిడిఓ కార్యాలయాల్లో ఫెసిలిటీస్ సెంటర్లు ప్రారంభించి ప్రతి మండలంలోని అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించి వెనువెంటనే పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. పైలెట్ ప్రజావాణి, ప్రజాఫిర్యాదుల పరిష్కార బహిరంగ విచారణలో భాగంగా బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో రాజస్థాన్ నుండి వచ్చిన భారతీయ సామాజిక కార్యకర్త మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్, సివిల్ సొసైటీ యాక్టివిటీ నిఖిల్‌డేతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయి ప్రజావాణిలో ముఖ్యంగా ప్రజాపాలన దరఖాస్తులు గ్యాస్ సబ్సిడీ, గృహజ్యోతి, విద్యుత్ బిల్, రుణమాఫీ సమస్యలు, అటవీ హక్కుల సమస్యలు, రేషన్, పెన్షన్ డిలీట్ సమస్యలపై అర్జీలు తీసుకుంటున్నామని తెలిపారు. భారతీయ సామాజిక కార్యకర్త మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్, సివిల్ సొసైటీ యాక్టివిటీ నిఖిల్ డే పైలెట్ ప్రజావాణి బహిరంగ విచారణలో రెండు రోజులుగా పాల్గొన్నారు. అర్జీదారుల సమస్యలను అన్ని శాఖలకు సంబంధించిన అధికారులకు చెప్పటం, వెంటనే సంబంధిత అధికారులు స్పందించటం జరుగతోందని తెలిపారు. గ్యాస్ సబ్సిడీ లాంటి కొన్ని సమస్యలు అక్కడికక్కడే కూడా పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. దేశంలోనే ఇంత మంచి కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభించి ప్రజల నుండి మంచి స్పందన వస్తున్నందుకు ప్రత్యేకంగా కలెక్టర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమం ఇలాగే కొనసాగాలని తెలిపారు. సమావేశంలో కిసాన్ మిత్ర రాష్ట్ర కో ఆర్డినేటర్ హర్ష సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్థమయ్యే రీతిలో బోధనలు చేయాలి



- డీఈఓ గమినియల్

నవతెలంగాణ-కెరమెరి

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధనలు చేయాలని డీఈఓ గమినియల్ సూచించారు. బుధవారం మండలంలోని సావర్‌ఖేడ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు చేపడుతున్న విద్యా బోధన తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను పరిశీలించారు. ఒకటవ తరగతి విద్యార్థులకు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. ప్రొజెక్టర్ ద్వారా చేపడుతున్న విద్యాబోధనపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పాటించాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను వెలికి తీసేందుకు టీచర్లు కృషి చేయాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని, అప్పుడే వాళ్లకు చదువుపై ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. అదే విధంగా విద్యార్థుల సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థులు అభివృద్ధిపై చర్చించి వారు చేయాల్సిన పనులను తెలియజేయాలన్నారు. డీఈఓ వెంట మండల విద్యాధికారి ఆడే ప్రకాష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

కన్నుల పండువగా వెంకటేశ్వర రథోత్సవం

నవతెలంగాణ-రెబ్బెన

రెండవ తిరుపతిగా పేరుగాంచిన గంగాపూర్ వెంకటేశ్వర స్వామి ఆలయం జాతరలో భాగంగా మూడవ రోజు భక్తజనంతో నిండిపోయింది. బుధవారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించిన రథోత్సవం ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మారుమోగింది. ఎమ్మెల్యే కోవ లక్ష్మి శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్సీ దండె విట్టల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎస్పీ శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు స్వామిని దర్శించుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.





పాన్ షాపులో రూ.23 వేలు చోరీ.

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓ పాన్ షాపులో దొంగతనం జరిగిన సంఘటన బుధవారం జిల్లా కేంద్రంలో వెలుగులోకి వచ్చింది. వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నటరాజ్ థియేటర్ దగ్గర ఉన్న మహరాజ్ పాన్‌షాప్‌లో దొంగతనం జరిగింది. యజమాని ఎప్పటిలాగే మంగళవారం రాత్రి 10 గంటలకు షాప్ మూసేసి ఇంటికెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం 6 గంటలకు షాప్ తీయగా చోరీ జరిగినట్టు గ్రహించాడు. కౌంటర్‌లో ఉన్న రూ.23వేల నగదు, ఒక మొబైల్ ఫోన్ చోరీ జరిగినట్టు తెలిపారు. షాప్ యజమాని వివేక్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై పద్మ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వెల్లడించారు.

పేకాట స్థావరంపై దాడి



నవతెలంగాణ-లక్సెట్టిపేట

మండలంలోని బలరావుపేట గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఎస్సై సతీష్ సిబ్బందితో కలిసి దాడి చేసి ఏడుగురు పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. పట్టుబడిన పేకాటరాయుళ్ల నుండి 5బైకులు, 6సెల్ ఫోన్లు, రూ.13వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పట్టుబడిన వారిలో బత్తుల రమేశ్, కోన తిరుపతి, బేర రాజయ్య, సంగ ఓదయ్య, గోర్క మల్లేష్, వనపర్తుల సుధాకర్, మండే సత్తన్న ఉన్నారు.

యువకుడిపై అట్రాసిటీ, రేప్ కేసు నమోదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓ యువకుడిపై అట్రాసిటీ, రేప్ కేసు నమోదైంది. బుధవారం వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాధితురాలిని శాంతినగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఆసిఫ్(27) గత మూడు సంవత్సరాలుగా ప్రేమ పేరుతో వేధిస్తూ, పెండ్లి చేసుకోమని వెంబడిస్తున్నాడు. అయితే ఆసిఫ్ ఆమెను ఇంట్లో నుంచి బలవంతంగా తీసుకెళ్లి ఓ గదిలో బంధించాడు. ఆమెకు మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. ఆ సమయంలో తీసిన ప్రయివేటు వీడియోలతో ఆమెను పెండ్లి చేసుకోమని బెదిరించాడు. పెళ్లి చేసుకోకుంటే వీడియోలు లీక్ చేస్తానని బెదిరించి, అలాగే కులం పేరుతో దూషించారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు.

16న జరగబోయే ఎమ్మెల్సీ సభ ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఈనెల 16న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశ సభ ఏర్పాట్లను బుధవారం డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు పరిశీలించారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్ రూరల్ మండలంలోని కొండాపూర్‌లోని చంద్రశేఖర్ కన్వెన్షన్‌లో జరగనున్న ముఖ్యనాయకుల సమావేశ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నరేందర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

పాలరాపు గుట్ట వద్ద ట్రైనీ ఎఫ్ఎస్ఓలు



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని నందిగామ బీట్‌లో ట్రైనింగ్ ఎఫ్ఎస్ఓలు ఎఫ్ఆర్ఓ రామ్మోహన్ ఆధ్వర్యంలో పర్యటించారు. ఈ సందర్భంగా పాలరాపు గుట్ట వద్ద గల రాబందుల ఆవాసాల గురించి వారికి ఆయన తెలియజేశారు. ప్రస్తుతం రాబందుల గుట్ట వద్ద రెండు రాబందులు ఉన్నాయని, వాటి సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వారికి తెలియజేశారు. మొత్తం 30 మంది ఎఫ్ఎస్ఓలకు రాబందుల స్థావరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి జగన్మోహన్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో నిర్మల్ పాఠశాల విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో తెలంగాణ ఓపెన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో నిర్మల్ జిల్లా రవి ఉన్నత పాఠశాలలో చదువుతున్న అనుముల శ్రీవైభవి అండర్-13 విభాగంలో ప్రతిభ కనబరిచింది. రాష్ట్రస్థాయిలో సింగిల్స్‌లో ప్రథమ స్థానం, డబుల్స్‌లో కూడా ప్రథమ స్థానంలో నిలిచింది. దీనికి గాను వారి తల్లిదండ్రులు అనుముల రాణి అమర్‌ను రవి హై స్కూల్ ప్రిన్సిపాల్ రాణి, కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు, పాఠశాల యాజమాన్యం అభినందించారు.